# ఎస్సై రిక్రూట్‌మెంట్‌పై ఎక్సైజ్‌లో మల్లగుల్లాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆబ్కారీశాఖ ఎస్సైల రిక్రూట్‌మెంట్‌పై గందరగోళం ఏర్పడింది. నూతన పాలసీ ఖరారుకు ఎక్సైజ్‌శాఖ సర్కార్ పంపిన ప్రతిపాదనలో డైరెక్ట్ ఎస్సై రిక్రూట్‌మెంట్ శాతాన్ని తగ్గించేసింది. నిర్దిష్ట ప్రతిపాదనలు లేవని, పూర్తిస్థాయి కసరత్తు చేసి ప్రతిపాదనలు పంపాలని ఎక్సైజ్‌శాఖకు తిప్పి పంపిన ఫైల్‌లో పేర్కొన్నట్టు సమాచారం. ఈ ప్రతిపాదనలను ఆమోదిస్తున్నట్టు ఫైలుపై కమిటీ సభ్యులు విధిగా సంతకాలు చేయాలి. కానీ కమిటీ సభ్యులు ఎస్సై కోటా తగ్గించే ఫైలుపై సంతకాలు పెట్టడానికి నిరాకరిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి రాష్ట్ర చట్ట అన్వయంతో గత విధానం ప్ర కారమే ఎస్సైల రిక్రూట్‌మెంట్ చేయాలి. మొత్తం పోస్టుల్లో డైరెక్ట్‌గా 50%, 25% క్లర్క్‌లకు, మరో 25% హెడ్ కానిస్టేబుళ్లకు ఇవ్వాలి. ప్రభుత్వానికి ఎక్సైజ్‌శాఖ పంపిన ప్రతిపాదనలో గతంలోని ఎస్సై డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, 35% శాతానికి తగ్గించింది. గతంలో క్లర్క్‌లకు 25 % కోటాను 35 శాతానికి.. హెడ్ కానిస్టేబుళ్లకు ఉన్న 25 శాతాన్ని 30 శాతానికి పెంచింది. ఈ ప్రతిపాదనలను కమిటీ ఆమోదించి ప్రభుత్వానికి పంపాలి. ఇవేవీ పట్టించుకోకుండా కమిటీ సభ్యుల సంతకాలు లేకుండా ఎక్సైజ్ శాఖ నుంచి నూతనంగా తయారు చేసిన ప్రతిపాదనలు సర్కార్‌కు చేరాయి.